## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ స్వామి వివేకానంద ఆలోచనలు యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ భారత్, జర్మనీ దేశాలు 19 కీలక అవగాహన ఒప్పందాలపై ఈరోజు సంతకాలు చేశాయి.
- ❖ విద్య వ్యక్తిత్వాన్ని ఏర్పరచడమే కాకుండా మేధస్సును విస్తరిస్తుందని ఉప రాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ అన్నారు.
- ❖ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28 నుండి ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి.

========================

స్వామి వివేకానంద ఆలోచనలు యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (VBYLD) 2026 ముగింపు సమావేశానికి ప్రధానమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ ఆవిష్కరణలను ప్రధానమంత్రి తిలకించారు. యువ నాయకులతో ముచ్చటించి వారి ఆలోచనలను తెలుసుకున్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ లు ఈరోజు గుజరాత్ గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో ఉన్నత స్థాయి ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత్-జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన పురోగతిపై ఈ సమావేశంలో సమీక్షించారు. రక్షణ, పారిశ్రామిక రంగాలలో సహకారాన్ని బలోపేతం చేయడానికి, రెండు దేశాలు పరస్పర అభివృద్ధి, ఉత్పత్తిపై దృష్టి సారించిన ఒక ప్రకటనపై సంతకం చేశాయి. సమావేశం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ...

భారతదేశం, జర్మనీ కేవలం ఆర్థిక భాగస్వాములు మాత్రమే కాదని ప్రపంచ శాంతి, స్థిరత్వానికి కట్టుబడిన దేశాలని అన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇరు దేశాలు ఒకే మాటపై ఉన్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఈ సమావేశం వివరాలను పాత్రికేయులకు వెల్లడించారు. ఈ సమీక్షలో భారత్, జర్మనీ 19 కీలక అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయని చెప్పారు. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ భారత పర్యటన రెండు దేశాల మధ్య బంధానికి ముఖ్యమైన సాక్ష్యంగా నిలిచిందని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమాజంలో అసమానతలను తగ్గించి.. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించి, దేశంలోని ప్రతి ప్రాంతానికి అభివృద్ధిని చేర్చేందుకు విద్య ఉపయోగపడాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం 9వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి ఈరోజు మాట్లాడుతూ... విద్య వ్యక్తిత్వాన్ని ఏర్పరచడమే కాకుండా మనస్సును బలోపేతం చేసి, మేధస్సును విస్తరిస్తుందని తెలిపారు. దేశ ఆర్థిక, సామాజిక, శ్రేయస్సు కోసం కృషి చేయాలని విద్యార్థులను కోరారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యాన్ని నెరవేర్చడానికి విద్య, సరైన శిక్షణ దేశ యువతను శక్తివంతం చేస్తాయని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28 నుండి ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... 2026-27 కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెడతారని తెలిపారు. జనవరి 28న ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల మొదటి దశ ఫిబ్రవరి 13న ముగిసి, రెండవ దశ మార్చి 9 నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగుతుందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు.. 2026 బడ్జెట్ సమావేశానికి పార్లమెంటు ఉభయ సభలను సమావేశపరచడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని మంత్రి తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కామన్వెల్త్ దేశాల స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ల సదస్సు (CSPOC) 28వ ఎడిషన్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 14వ తేదీ నుండి మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో ఈ సదస్సు జరుగనున్నదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పాత్రికేయులకు వెల్లడించారు. 60కి పైగా కామన్వెల్త్ దేశాలు, సెమీ అటానమస్ పార్లమెంట్లకు సంబంధించిన స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. సభా కార్యకలాపాల్లో కృత్రిమ మేధస్సు వాడకం, ఉత్తమ విధానాలు, సభ్యులపై సామాజిక మాధ్యమాల ప్రభావం మొదలగు అంశాలపై వివిధ సెషన్‌లు జరుగుతాయని స్పీకర్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత పదకొండు ఏళ్లలో దేశంలో చేపల ఉత్పత్తి 106 శాతానికి పైగా వృద్ధి సాధించిందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ ఈ రోజు తెలిపింది. 2013-14లో 95 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరగ్గా, 2024-25 నాటికి దాదాపు 198 లక్షల టన్నులకు పెరిగిందని తెలియజేసింది. ఆక్వాకల్చర్ రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుందని, సుమారు 3 కోట్ల మంది మత్స్యకారులు, చేపల రైతులకు జీవనోపాధిని అందిస్తున్నదని పేర్కొంది. భారత్.. ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా ఉంటూ.. ప్రపంచ ఉత్పత్తికి 8 శాతం తోడ్పడుతుందని స్పష్టం చేసింది. నీలి విప్లవం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ-యోజన వంటి వివిధ పథకాల కోసం 2014-15 నుండి 32 వేల 723 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించింది.

========================

ఈ నెల 9వ తేదీ నాటికి రబీ పంటల మొత్తం విస్తీర్ణం 644 లక్షల హెక్టార్లకు పైగా చేరుకుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ రోజు తెలియజేసింది. రబీ పంటలు బలమైన వృద్ధిని నమోదు చేశాయని, గత సంవత్సరంతో పోలిస్తే మొత్తం విస్తీర్ణం 17 లక్షల హెక్టార్లకు పైగా పెరిగిందని తెలిపింది. గోధుమలను 334 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోనూ, వరి 21 లక్షల హెక్టార్లు, పప్పుధాన్యాలను 136 లక్షల హెక్టార్లకు పైగా సాగు చేశారని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 576 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై... చివరికి 302 పాయింట్ల లాభంతో 83 వేల 878 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 106 పాయింట్లు లాభపడి 25 వేల 790 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 90 రూపాయల 16 పైసలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63.02 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 589 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

========================

ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఉత్తరాఖండ్‌లలో రాబోయే 3 నుండి 4 రోజుల వరకు దట్టమైన పొగమంచు పరిస్థితులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. రాబోయే 2 రోజుల్లో తూర్పు, ఈశాన్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ తగ్గుతాయని తెలిపింది. తదుపరి 3 రోజుల్లో మధ్య భారతదేశంలో ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ పెరుగుతాయని IMD అంచనా వేసింది.

========================

========================